సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ:రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.



అంజన్నకు మొక్కులు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం వేలాదిమంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

జిల్లాలో వెటర్నరీ కాలేజీ

- అక్వా ప్రైవేటు విశ్వవిద్యాలయంతో ఉపాధి
- మీ దయతోనే అధికారం.. మీకోసం ఖర్చు చేస్తున్న
- వర్కర్ టూ ఓనర్ పథకంతో మరో తిరుపూర్‌గా సిరిసిల్ల
- కరీంనగర్ పార్లమెంట్ స్థానాన్ని సీఎంకు గిఫ్ట్‌గా ఇద్దాం
- సిరిసిల్ల ప్లీనరీలో మంత్రి కేటీఆర్



సిరిసిల్లలో ప్లీనరీలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు



బీఆర్‌ఎస్ సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

సిరిసిల్ల: జిల్లాలో వెటర్నరీ (పశువైద్య) కాలేజీ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పెద్దూరు అపెరల్ పార్క్ వద్ద బీఆర్‌ఎస్ ప్రతినిధుల ప్లీనరీ మంగళవారం జరిగింది. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ 22 ఏళ్ల కిందట కేసీఆర్ గులాబీ జెండాను పట్టుకున్నప్పుడు అందరిలోనూ అపనమ్మకం ఉండేదని, కేసీఆర్ అప్పుడు పెద్దగా ఎవరికీ తెలియదన్నారు. ఓట్లు వేయండి.. సీట్లు ఇవ్వండి.. తెలంగాణ తేకుంటే.. రాళ్లతో కొట్టండి అంటూ.. కరీంనగర్ సింహగర్జనతో కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లి విజయం సాధించారన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా రూ.50లక్షల రోడ్డు కోసం అప్పటి పీఆర్ మంత్రి జానారెడ్డి వద్దకు 50 సార్లు వెళ్లినా పట్టించుకోలేదన్నారు. మరో మంత్రి దివాకర్‌రెడ్డి వద్దకు వెళ్లితే.. మీ తెలంగాణ వచ్చిన తరువాత నిధులు వస్తాయని వెకిలిగా మాట్లాడారని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రం రాక ముందు సిరిసిల్లలో ఒక్క డిగ్రీ కాలేజీ ఉండేదని, ఇప్పుడు నర్సింగ్ కాలేజీ, వ్యవసాయ డిగ్రీ కాలేజీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ, జేఎన్‌టీయూ, త్వరలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుతో కలిసి వచ్చి మెడికల్ కాలేజీని ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో వెటర్నరీ కాలేజీని కూడా ఏర్పాటు చేస్తామ ప్రకటించారు. మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో అక్వా ప్రైవేటు విశ్వవిద్యాలయం ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. సిరిసిల్లలో రూ.400 కోట్లతో వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అపెరల్ పార్క్‌లో ఏర్పాటు చేశామని, ఇది పూర్తి అయితే.. మరో తిరుపూర్‌లా అభివృద్ధి చెందుతుందన్నారు.

గంభీరావుపేట సర్పంచ్‌కు అభినందనలు

గంభీరావుపేట సర్పంచ్ శ్రీధర్ పంతులు ఇటీవల ఢిల్లీలో జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్నారని, ఆయన్ని వేదిక పైకి పిలిచి మరీ అభినందించారు. జిల్లాలోని అన్ని పల్లెల్లో డంపుయార్డులు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, ట్రాక్టర్, ట్యాంకర్, క్రీడాప్రాంగణాలు ఉన్నాయని కేటీఆర్ వివరించారు. 2018లో 89వేల ఓట్ల మెజార్టీ ఇచ్చారని, అదే పార్లమెంట్ ఎన్నికల్లో పట్టించుకోకపోవడంతో విచిత్రమైన జీవిని కరీంనగర్ ఎంపీగా తెచ్చుకున్నామని కేటీఆర్ అన్నారు. ఈ సారి అలా కాకుండా కరీంనగర్ ఎంపీ సీటు గెలిపించి సీఎం కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇవ్వాలన్నారు.

ప్రతిపక్షాలకు ఓట్లు రావు: దేశపతి శ్రీనివాస్

ఎమ్మెల్సీ, కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల రూపురేఖలు మారిపోయాయని, అభివృద్ధిలో ఎంతో ముందుందన్నారు. రామారావు చేసిన అభివృద్ధిని చూసి ప్రతిపక్ష నేతలు మాకు ఇక ఓట్లు రానేరావు అనే పరిస్థితి ఉందన్నారు. కేటీఆర్ భాషపై పట్టు సాధించి ఏ వేదికపైనా అయిన నిప్పులు చెరిగేలా మాట్లాడే స్థాయికి చేరారని అభినందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతు బంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, 'సెస్' డైరెక్టర్లు, ఏఎంసీ చైర్మన్‌లు పాల్గొన్నారు.



పేర్లు నమోదు చేసుకున్న నేతలు

వర్షంతో ఆగిన తీర్మానాలు..

బీఆర్‌ఎస్ ప్లీనరీలో 12 అంశాలపై తీర్మాణాలు ప్రవేశ పెట్టాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించారు. వ్యవసాయం, మహిళా సంక్షేమం, విద్యుత్, వస్త్రపరిశ్రమలపై తీర్మాణాలు ప్రవేశపెట్టారు. భోజన విరామం తరువాత మరిన్ని తీర్మాణాలు ప్రవేశపెట్టాలని భావించారు. కానీ గాలి వాన రావడంతో సభను అర్ధాంతరంగా నిలిపివేశారు. వర్షంలోనే మంత్రి కేటీఆర్ వెళ్లిపోయారు. పార్టీ శ్రేణులు కుర్చీలు కప్పుకుని, ఫ్లెక్సీలు చుట్టుకుని వెళ్లారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్



తనిఖీలు చేస్తున్న పోలీసులు

జనాదరణతోనే నాలుగుసార్లు గెలిచాను

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: రమేశ్‌బాబు ఒత్తిడిలో ఉన్నాడంటూ ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలు సరైనవి కావని, ప్రజల ఆదరణతో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేతల ప్లీనరీ సమావేశం స్థానిక మహారాజా ఫంక్షన్‌హాలులో జరిగింది. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ సంక్షేమఫలాలు అందిస్తున్నారని అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో 70 ఏళ్లలో జరగని అభివృద్ధి తెలంగాణ ఏర్పడ్డాక జరిగిందని పేర్కొన్నారు. వేములవాడ పట్టణంతోపాటు అన్ని మండలాల్లో అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు మార్చి 25 నుంచి ఏప్రిల్ 25 వరకు 9 ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించామని, దాదాపు 9 వేల మంది హాజరయ్యారన్నారు. అనంతరం 20 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థులకు కల్పతరువు 'అన్నపూర్ణ'



భోజనం వడ్డిస్తున్న ఆకునూరి శంకరయ్య

సిరిసిల్లటౌన్: పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు సిరిసిల్లలోని అన్నపూర్ణ భోజన పథకం కల్పతరువు లాంటిదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య అన్నారు. మంగళవారం గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనాలను ప్రారంభించారు. నిరుద్యోగ యువతీ, యువకులు పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు గ్రంథాలయం అనువైనదని అన్నారు. ఇక్కడ అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, దూర ప్రాంతాలు, పల్లెల్ల నుంచి వచ్చే విద్యార్థులకు అన్నపూర్ణ పథకం ద్వారా ఉచితంగా భోజనం అందిస్తున్నట్లు వివరించారు. గ్రేడ్–2 గ్రంథపాలకుడు బి.శంకరయ్య, కె.మల్లయ్య, కె.శ్రీనివాస్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న సుమన్ మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: మలేరియా నిర్మూలన అందరి బాధ్యత అని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిరిసిల్లలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీ చేపట్టారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. 'మలేరియా రహితం నా నుండి మొదలు కావాలని' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు మాట్లాడుతూ డ్రైనేజీలు, నీటిగుంటల్లో దోమలు వ్యాప్తిచెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు బి.శ్రీరాములు, నయీమా, ఏవో శ్రీనివాస్, డీపీఎంవోలు లింగం, కాశీనాథం, సురేష్‌రెడ్డి, బాలయ్య, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పోర్ట్స్ మీట్



ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వార్షిక పోలీసు స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 27, 28 తేదీలలో క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

రాలిన ఆశలు



రాలిన వరిగొలకలు చూపుతున్న రైతు ఎల్లారెడ్డిపేట మండలంలోని గుంటపల్లి చెరువు తండాకు చెందిన గుగులోతు పుణ్యానాయక్. ఈ గిరిజన రైతు తనకున్న ఐదున్నర ఎకరాలలో వరిపంటను సాగుచేశాడు. వారం రోజుల్లో వరి కోత కోయడానికి సిద్ధపడుతున్న క్రమంలోనే వడగండ్ల వాన అపారనష్టం కలిగించింది. సుమారు నాలుగు ఎకరాలలో పంట రాలిపోయింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

ఈ చిత్రంలో నేలరాలిన వరిపంటను చూపుతున్న రైతు ఎల్లారెడ్డిపేటకు చెందిన బందారపు బాల్‌రెడ్డి. తనకున్న మూడున్నర ఎకరాలలో వరిపంట వేశాడు. మంగళవారం కురిసిన వడగండ్ల వానకు దాదాపు సగం పంట నేలవాలింది. ఆరుగాలం కష్టపడితే.. చేతికొచ్చే సమయంలో ఇలా వడగండ్లతో పంట నష్టపోవడంతో పెట్టుబడులు మీద పడే పరిస్థితులు వచ్చాయని రైతు ఆందోళన వ్యక్తం చేశాడు.





పొలంలో దిగాలుగా కూర్చున్న రైతు ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాలకు చెందిన నిమ్మల బాబు. తనకున్న మూడున్నర ఎకరాలలో వరిపంట సాగు చేశాడు. మంగళవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానకు వరిపంట పూర్తిగా నేలవాలింది. పంట చేతికొచ్చే పరిస్థితులు లేకపోవడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి. వడగండ్ల వానలతో పంటలు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

మంగళవారం నాటి వర్షపాతం ఇలా(మిల్లీమీటర్లలో)

వీర్నపల్లి	54.8
పెద్దూరు	47.5
గజసింగవరం	35.8
నిజామాబాద్	32.8
ఎల్లారెడ్డిపేట	23.5
ఆవునూరు	23.3
నాంపెల్లి	10.3
మల్లారం	6.8
మర్రిగడ్డ	5.3
రుద్రంగి	4.3
నామాపూర్	3.0
గంభీరావుపేట	1.5
పెద్దలింగాపూర్	1.3
వట్టిమల్ల	0.8

- వరుసగా మూడోరోజు రాళ్లవాన
- సిరిసిల్ల, వీర్నపల్లిలో అత్యధికం
- పంటపొలాల్లో రాలిన ధాన్యం
- కేంద్రాల్లో తడిసిన వడ్లు
- కంటతడి పెడుతున్న రైతులు
- ఆదుకోవాలని వేడుకోలు



కోనరావుపేట: మర్రిమడ్లలో పొలంలో రాలిన వడ్లు



ముస్తాబాద్: కొండాపూర్‌లో తడిసిన ధాన్యం కుప్పలు



చికిత్స పొందుతున్న జంపయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/బోయినపల్లి(చొప్పదండి)/సిరిసిల్లటౌన్: నోటికాడికి వచ్చిన బుక్కను చెడగొట్టువాన నీటిపాలు చేసిందని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంట చేతికొచ్చిందనుకునే సమయంలో రాళ్లవాన దెబ్బకొట్టిందని లబోదిబోమంటున్నాడు. పాటపొలంలో రాలిన వరిగింజలు, కల్లాల్లో తడిసిన ధాన్యం రైతన్న ఆశలపై నీళ్లు చల్లాయి. మూడురోజులుగా ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలు కంటిమీదకునుకు లేకుండా చేస్తున్నాయి. పొద్దంతా ఎండ, సాయంత్రం గాలివాన ఆగం చేస్తోంది. యాసంగి మొదట్లో తెగుళ్లతో తిప్పలు పడ్డ రైతులు.. వరికోసే సమయంలో అకాల వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో యాసంగి సీజన్‌లో 1.70 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా.. 40శాతం మేర కోతలు పూర్తిచేశారు. మరో 60శాతం కోతదశలో ఉన్నాయి. బోయినపల్లి, వీర్నపల్లి, కోనరావుపేట, చందుర్తి, వేములవాడరూరల్ మండలాల్లో తీవ్రనష్టం వాటిల్లింది. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో పంటలపై మరింత ప్రభావం పడింది.

- ఎల్లారెడ్డిపేట మండలంలో గంటకు పైగా కురిసిన రాళ్లవానకు వరిపంట పూర్తిగా ధ్వంసమైంది. మామిడికాయలు నేలరాలాయి. వానతో వరిగొలకలు పూర్తిగా రాలిపోవడంతో చేనులో గింజలు లేని వరిగడ్డి మాత్రమే కనిపిస్తుండడంతో రైతన్నలు రోదిస్తున్నారు. బోయినపల్లి మండలం తడగొండ, మర్లపేట, అనంతపల్లి గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తిప్పలు పడుతున్నారు. బోయినపల్లి సెంటర్‌లో పదిరోజుల క్రితం పోసిన ధాన్యం మ్యాచర్ వచ్చినప్పటికి కొనుగోళ్లు జరపడం లేదని రైతు బీరయ్య ఆవేదన చెందాడు.
- వేములవాడరూరల్: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని వేములవాడ ఎమ్మెల్యే రమేష్‌బాబు అన్నారు. వేములవాడ రూరల్ మండలంలోని ఎదురుగట్ల, నమిలిగుండుపల్లి, వట్టెంల గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు. రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బాధితులకు ఎకరాన రూ.25 వేలు ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల, నూకలమర్రి, ఎదురుగట్లతో పాటు పలు గ్రామాల్లో వేర్వేరుగా నష్టపోయిన పంటలు పరిశీలించారు.
- కోనరావుపేట/చందుర్తి: కోనరావుపేట మండలంలోని మరిమడ్ల, శివంగాలపల్లి, తదితర గ్రామాల్లో కురిసిన వర్షానికి పొలాల్లో కోతకు వచ్చిన వడ్లు రాలిపోయాయి. శివంగాలపల్లిలో లింగంపెల్లి శ్రీకాంత్‌కు చెందిన నాలుగు ఎకరాల వరిపంటలో వడ్లుమొత్తం రాలిపోయి గడ్డి మాత్రమే మిగిలింది. చందుర్తి మండలంలోని మూడపల్లి, అనంతపల్లి, నర్సింగపూర్, మర్రిగడ్డ, ఆశిరెడ్డిపల్లె గ్రామాల్లో కోతకు వరిపొలాల్లో వడ్లు రాలిపోయాయి.
- గంభీరావుపేట(సిరిసిల్ల)/ముస్తాబాద్/వీర్నపల్లి: గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్, గూడెం, ఆవునూర్, పోతుగల్, నామాపూర్ కేంద్రాల్లో ధాన్యం తడిసింది. రైతులకు టార్పాలిన్లు లేక ఇబ్బందులు పడ్డారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో కురిసిన రాళ్లవర్షానికి వరిపంటలు నేల రాలాయి. భారీ వర్షానికి పోలీస్‌స్టేషన్ ఆవరణలోకి నీరుచేరింది. మండలంలోని వన్‌పల్లి, శాంతినగర్, గర్జనపల్లి, సీతరాంనాయక్ తండా గ్రామాల్లో నష్టపోయిన పంటలను తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ పరిశీలించారు. నివేదికను పైఅధికారులకు అందిస్తామని అన్నారు.
- సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు, రగుడు, చంద్రంపేట, బోనాల, సర్దాపూర్ తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానతో రైతులు ఆగమయ్యారు. పెద్దూరులోని గౌడ కులస్తులకు చెందిన కల్లుమండువాలోని రేకుల షెడ్డు కూలిపోయింది. చిన్నబోనాలలో పిడుగుపాటుకు ఓ వ్యక్తి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ముద్దం జంపయ్య మరో వ్యక్తితో కలిసి గొర్లను మేపేందుకు వెళ్లారు. వర్షం రావడంతో చెట్టుకిందికి వెళ్లారు. చెట్టుపై పిడుగుపడి పక్కనే ఉన్న కుక్కపై పడింది. కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. జంపయ్యకు వీపుభాగంతో పాటు కాళ్ల ప్రాంతం గాయాలయ్యాయి. కౌన్సిలర్ బొల్గం నాగరాజు బాధితుడిని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో చేర్పించాడు. సర్దాపూర్‌లో సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై వర్షానికి భారీ వృక్షం నేలకొరిగింది. ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పెద్దూరులోని పోచమ్మ ఆలయ సమీపంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో సరఫరా నిలిచిపోయింది.



బోయినపల్లి సెంటర్‌లో ధాన్యంపై కప్పిన కవర్లు



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు



వరద నీటిలో సిరిసిల్ల పాతబస్టాండు ప్రాంతం



నష్టపోయిన వరిని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

వడగండ్ల బాధిత రైతులను ఆదుకోవాలి

- ఎకరానికి రూ.25వేల పరిహారం చెల్లించాలి
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- విన్నవించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్, తదితరులు

సిరిసిల్ల: జిల్లాలో సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంలో ప్రభుత్వం విఫలమైందని, అకాల వర్షం నష్టపోయిన బాధిత రైతులను ఆదుకోవాలని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. కలెక్టరేట్ ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ అకాల వర్షంతో పంటలను నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించి ఉంటే.. రైతుల ధాన్యం తడిసేది కాదని, అకాల వర్షంతో పంట తడిసిపోయి రైతులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారని వివరించారు. జిల్లాలో వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించలేదని, తేమ శాతం వచ్చినా.. బీఆర్‌ఎస్ నాయకులు వచ్చి కొబ్బరి కాయ కొట్టి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాల్సి ఉందని జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్‌కు కాంగ్రెస్ పార్టీ పక్షాన వినతి పత్రం అందించారు. నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, కేతిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఆకునూరి బాలరాజు, కూస రవీందర్, చిలుక రమేశ్, నర్సయ్య, ఫిరోజ్‌పాషా, సూర దేవరాజు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పరీక్షలు

- 'పది'లో 259, ఇంటర్‌లో 439 మంది హాజరు

సిరిసిల్లఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు జిల్లాలో మంగళవారం ప్రారంభమయ్యాయి. విద్యానగర్ బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు కేంద్రాలు పదోతరగతి పరీక్షలకు కేటాయించగా, సిరిసిల్ల శివనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్, వెంకంపేట హైస్కూల్‌లో ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంగళవారం నిర్వహించిన తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షల నిర్వహణలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని జిల్లా విద్యాధికారి రమేశ్ తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 288 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 259 మంది హాజరయ్యారని, ఇంటర్ పరీక్షకు 488 హాజరవ్వాల్సి ఉండగా 439 మంది హాజరైనట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

ఒకే ఒక్కడు..



పరీక్ష రాస్తున్న అభ్యర్థి

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో మంగళవారం నుంచి ప్రారంభమైన ఓపెన్ పరీక్షల్లో వింత అనుభవం పరీక్షల పర్యవేక్షకులకు ఎదురైంది. ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇంటర్, టెన్త్ పరీక్షలు మంగళవారం ఉదయం ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం నిర్వహించిన హిందీ పరీక్షకు సిరిసిల్ల శివనగర్ పాఠశాలలో ఇద్దరు అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంది. ఈ పరీక్షకు ఒకరు మాత్రమే హాజరయ్యారు. పర్యవేక్షణకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, ఇన్విజిలేటర్, క్లర్క్, సిట్టింగ్ స్క్వాడ్, ఏఎస్ఎం, పోలీసు సిబ్బందికి విధులు కేటాయించారు. సిరిసిల్ల పట్టణం వెంకంపేటలోనూ నలుగురు పరీక్ష రాయాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే హాజరైనట్లు గణాంకాలున్నాయి.

మొబైల్ అందజేత



ఈశ్వర్‌కు ఫోన్ అప్పగిస్తున్న సీఐ వెంకటేశ్

వేములవాడ: తిప్పాపూర్ గ్రామానికి చెందిన ఈశ్వర్ తన మొబైల్ పోగొట్టుకున్నారు. పోలీసులు ఇటీవల తీసుకొచ్చిన Ceir.gov.in యాప్ ద్వారా మొబైల్‌ను పట్టుకుని మంగళవారం సీఐ వెంకటేశ్ బాధితుడికి అప్పగించారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే దరఖాస్తు చేసుకుని యాప్ సహాయంతో పట్టుకుని అప్పగిస్తామని సీఐ తెలిపారు.

హద్దురాళ్లు తొలగింపు



చంద్రగిరిలో హద్దురాళ్లు తొలగింపు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చంద్రగిరి గ్రామంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్ల హద్దురాళ్లను మంగళవారం జేసీబీతో తొలగించినట్లు సర్పంచ్ రాసూరి రాజేశం తెలిపారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలో ప్లాట్‌లను కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దన్నారు. అక్రమ లే అవుట్‌ల హద్దురాళ్లను తొలగించి, హద్దురాళ్లను గ్రామపంచాయతీకి తరలించామని వివరించారు.

మందుబాబులకు జైలు, జరిమానా

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన ఆరుగురిని ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరుపరచగా ఓ వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా, మిగతావారికి రూ.6,500 జరిమానా విధించారు. ఈసందర్భంగా రోజూ నగరంలో డ్రంకెన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్‌లు ఉంటాయని, మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

మండు వేసవిలో.. నిండుగా..



ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో మానేరు వాగుపై ఇటీవల నిర్మించిన చెక్ డ్యామ్ మత్తడి దూకుతోంది. ఎగువ మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోగా.. ఇటీవల కురుస్తున్న వానలకు మానేరు పారుతోంది. ఈ నేపథ్యంలో ఆవునూర్ చెక్ డ్యామ్ మత్తడి పోస్తుండడంతో కిందికి వాగు పారుతోంది. చెక్‌డ్యామ్ నిర్మాణం సుదీర్ఘంగా కొనసాగి.. గత వానకాలంలో కొంత భాగం కొట్టుకుపోయింది. ఇటీవల మరమ్మతు చేశారు. ప్రస్తుతం వాగు మత్తడి దూకడంతో తుర్కపల్లి, రామలక్ష్మణపల్లె, ఆవునూర్ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జూన్‌లోగా రైల్వేలైన్ భూసేకరణ

- కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్‌పై సమీక్ష
- ఇప్పటికే 804 ఎకరాల భూసేకరణ
- మరో 122 ఎకరాల భూసేకరణ పూర్తి చేస్తాం
- జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వేలైన్ భూసేకరణను జూన్ నెలాఖరులోగా పూర్తి చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ తెలిపారు. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్‌పై ఢిల్లీ నుంచి మంగళవారం కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలశాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ కోసం 926 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే 804 ఎకరాల భూసేకరణ పూర్తి అయిందని ఖీమ్యానాయక్ వివరించారు. మరో 122 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. సాధ్యమైనంత తొందరగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేయాలని జూన్ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ అధికారులు సూచించారు. ఈ మేరకు జిల్లాలో రైల్వే భూసేకరణను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేస్తామని అదనపు కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిశ్రమలశాఖ జీఎం ఉపేందర్‌రావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'కు స్పందన



సిరిసిల్ల సుందరయ్యనగర్ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళా కార్యక్రమం

సిరిసిల్లటౌన్: జిల్లా వైద్యారోగ్యశాఖ చేపట్టిన 'ఆరోగ్య మహిళ' శిబిరానికి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఏసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళా శిబిరాల్లో ఓపీడీ (401), బ్రెస్ట్(401), ఆర్‌సీఎగ్జామినేషన్(401) పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ(12), ల్యాబ్(128), థైరాయిడ్(78), విటమిన్ డీ(54), సీబీపీ(104), సూక్ష్మ పోషకాలు(59) మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో 13 మందిని జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.

ఇంటికి చేరిన గల్ఫ్ మృతదేహం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కోనరావుపేట: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వ్యక్తి దుబాయిలో మృతిచెందగా, మృతదేహం మూడు రోజులకు ఇంటికి చేరింది. కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన కీసరి వెంకటేశ్(48) గత కొన్ని సంవత్సరాల నుంచి దుబాయిలో ఓ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నా డు. వెంకటేశ్‌కు ఇదివరకు గుండె ఆపరేషన్ అ య్యింది. ఈ నెల 22 శనివారం రాత్రి 10.30గంటలకు గుండెలో నొప్పిరావడంతో అక్కడే ఉంటున్న స్నేహితులు ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందా డు. వెంకటేశ్ మృతదేహం మంగళవారం ఇంటికి చేరడంతో భార్య లావణ్య, ఇద్దరు కూతుళ్లు వర్ష, వందన, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

నేడు డయల్ యువర్ డీఎం

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమం బుధవారం 11గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. 99592 25926 ఫోన్ నంబరుకు కాల్‌చేసి సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

'ఇంటెలిజెన్స్ సీఐ వేధింపులతోనే ఆత్మహత్య'



చొప్పదండి ఠాణాలో పౌరహక్కుల నేతలు

చొప్పదండి: భూపాలపట్నంలో ఆత్మహత్య చేసుకున్న రియల్టర్ బొడిగె శ్యాంది సెంట్రల్ ఇంటలిజెన్స్ సీఐ గోపాలక్రిష్ణ చేసిన హత్యగానే భావిస్తున్నట్లు పౌరహక్కుల సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని భూపాలపట్నంతోపాటు, చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో వారు మంగళవారం పర్యటించి ఆత్మహత్యపై విచారణ జరిపారు. అనంతరం పలు వివరాలు వెల్లడించారు. భూమిపై పెట్టిన పెట్టుబడిపై అధిక మొత్తంలో లాభాల కోసం గోపాలక్రిష్ణ పలుమార్లు శ్యాంను బెదిరించడంతోనే ఆత్మహత్యకు దారితీసిందని తాము భావిస్తున్నామన్నారు. డైరీలో పది పేజీల సూసైడ్ నోట్ కూడా రాశాడని, చొప్పదండి సీఐతో చెప్పి కేసులు పెట్టిస్తానని బెదిరించారని పేర్కొన్నారు. ఈ ఆత్మహత్యపై తెలంగాణ ప్రభుత్వానికి, డీజీపీకి లిఖితపూర్వకంగా త్వరలోనే ఫిర్యాదు చేస్తామన్నారు. సెంట్రల్ సీబీఐ సీఐ గోపాలక్రిష్ణను వెంటనే అరెస్ట్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ తక్షణమే స్పందించి కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలో పనిచేస్తున్న సీబీఐ, ఇతర పోలీసులు, తెలంగాణ రాష్ట్ర పోలీసులు రియల్ ఎస్టేట్‌లో చేస్తున్న వ్యాపారాల మాఫియాను అరికట్టాలన్నారు. బాధిత శ్యాం కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, ఉపాధ్యక్షురాలు పుల్ల సుచరిత, గడ్డం సంజీవ్‌కుమార్, పోగుల రాజేశం, మోటపలుకుల వెంకట్, మార్వాడీ సుదర్శన్ తదితరులున్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

కరీంనగర్‌క్రైం: అదనపు కట్నం కోసం భార్యను వేధించడంతోపాటు ఆమెపై అనుమానం పెంచుకొని రోకలిబండతో కొట్టి చంపిన నేరంలో భర్త మొగుళ్ళ పరశురాం (32)కు జీవిత ఖైదుతో పాటు రూ.17 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి.ప్రతిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తెలిపిన కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలం చెప్యాలకు చెందిన దయ్యాల కవితకు రామడుగు మండలం కిష్టరావుపల్లికి చెందిన మొగుళ్ల పరశురాంతో 2012లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. అనంతరం భార్యను అనుమానించడంతోపాటు అదనపు కట్నం కోసం వేధించగా కొంత డబ్బు చెల్లించినా అతడి తీరు మారలేదు. 2018 ఆగస్టు 14న సాయంత్రం ఇంట్లో భార్యతో గొడవపడిన పరశురాం ఆమెను రోకలిబండతో తలపై కొట్టగా తీవ్ర గాయాలతో కవిత (25)చనిపోయింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఆశాలు ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి రామడుగు ఎస్సై రవి కేసు నమోదు చేయగా అప్పటి రూరల్ ఏసీపీ ఉషారాణి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి ప్రతిమ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీ



స్వాధీనం చేసుకున్న లారీలు

జమ్మికుంట(హుజూరాబాద్): రేషన్ బియ్యాన్ని (పీడీఎస్) రీసైక్లింగ్ చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్ ఓఎస్‌డీ ప్రభాకర్ సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. వివరాలు.. పట్టణంలోని శ్రీశక్తి మిల్లు నుంచి రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి వేరే మిల్లు ద్వారా ఏసీకేలు పంపుతున్నారని ఫిర్యాదు అందడంతో శ్రీశక్తి మిల్లులో తనిఖీలు చేపట్టారు. అప్పటికే లారీలు సివిల్ సప్లై గోదాంలకు వెళ్లాయనే సమాచారం మేరకు లారీ వద్దకు చేరుకున్నారు. 7 లారీల వివరాలు సేకరించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లారీలను ల్యాబ్ టెస్ట్‌కు పంపాలని జిల్లా సివిల్ సప్లై డీఎం శ్రీకాంత్‌కు సమాచారం అందించారు. ఆధారాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపినట్లు ఓఎస్‌డీ ప్రభాకర్ పేర్కొన్నారు. కాగా పట్టణంలోని శ్రీశక్తి ఇండస్ట్రీస్ రైస్ మిల్ నిర్వాహకులు సీఎంఆర్ ద్వారా ప్రభుత్వం అందించిన ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్నారని, రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి, సివిల్ సప్లై గోదాంకు ఏసీకే ద్వారా అందిస్తున్నారని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్‌కు ఈ నెల 17న పట్టణానికి చెందిన కొండ్లే పాపయ్య ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి సివిల్‌సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.

ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని పద్మనగర్‌లో గల కపిల్ ప్లాస్టిక్స్‌లో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. మంటలను చూసిన స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారమందించగా, కరీంనగర్ ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. గోడలు తడిగా ఉండడంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని గుర్తించారు. సుమారుగా రూ.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఫైర్ అధికారులు అంచనా వేస్తున్నారు.

రైతులకు న్యాయమైన సేవలు అందించాలి



కోనరావుపేటలో మాట్లాడుతున్న జడ్జి ప్రేమలత

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

కోనరావుపేట(వేములవాడ): రైతులకు వ్యవసాయపరమైన సమస్యలు ఎదుర్కొన్నప్పుడు వారికి న్యాయపరమైన సేవలు అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత అన్నారు. కోనరావుపేటలోని గ్రామపంచాయతీ ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను మంగళవారం ప్రారంభించారు. రైతులు కల్తీ విత్తనాలు, పురుగుల మందుల ద్వారా నష్టపోతే ఈ క్లినిక్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సర్పంచ్ పోకల రేఖ, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ, న్యాయవాద సంఘం అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, ప్రభుత్వ న్యాయవాది బి.రవీందర్‌రావు, లోక్ అదాలత్ సభ్యులు పెంట శ్రీనివాస్, ఆడెపు వేణు, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు

- ఈనెల 28న పోలింగ్.. పోటాపోటీగా ప్రచారం



నామినేషన్ దాఖలు చేస్తున్న న్యాయవాదులు

వేములవాడ: వేములవాడ బార్ అసోసియేషన్ రీ ఎలక్షన్లకు నామినేషన్ల పర్వం మంగళవారం జరిగింది. గతనెల 28న జరిగిన ఎన్నికల్లో బైలాస్ ప్రకారం నిబంధనలు పాటించలేదని పేర్కొంటూ పిట్టల మనోహర్ రాష్ట్ర బార్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన బార్ అసోసియేషన్ ఆ ఎన్నికను రద్దు చేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంటూ నలుగురు అడ్‌హాక్ కమిటీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, రేగుల దేవేందర్, విద్యాసాగర్‌రావు, గుమ్మడి శ్రీనివాస్‌లను నియమించింది. దీంతో మంగళవారం నామినేషన్లు స్వీకరించారు. స్క్రూటినీ పూర్తిచేసి పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటించారు. ఈనెల 28న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ జరగనుంది. భోజన విరామం అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే...

అధ్యక్షుడిగా పిట్టల మనోహర్, పెంట రాజు, ఉపాధ్యక్షులుగా గడ్డం సత్యనారాయణరెడ్డి, ప్రతాప సంతోష్, ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్, పి.భానుకృష్ణ, సహాయ కార్యదర్శిగా తల్లం రాజేంద్రప్రసాద్, స్పోర్ట్స్ సెక్రటరీగా రజనీకాంత్, రాజ్‌కుమార్, కోశాధికారిగా బొడ్డు ప్రశాంత్‌కుమార్, బీ. నరేష్, సీనియర్ ఈసీ మెంబర్లుగా నరాల శ్రీనివాస్, డి. ప్రవీణ్, బీ. గంగరాజు, కే. నర్సింగారావు, జూనియర్ ఈసీ మెంబర్లుగా ఎస్. వంశీకృష్ణ, జీ.రమేశ్, తోట శేఖర్, బీ. బాలరాజు, కే. శ్రీనివాస్, జి. విజయ్‌కుమార్, పి. నాగరాజులు పోటీలో ఉన్నట్లు ప్రకటించారు.

ప్రభుత్వ పాఠశాల స్క్రాప్ పక్కదారి



స్క్రాప్‌ను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను రూ.9 కోట్ల నిధులతో కేజీ టూ పీజీ పాఠశాలగా మారుస్తున్నమంటూ.. ఈ నెల 22న ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. ప్రస్తుతం పాఠశాల పాత భవనాల కూల్చివేత జరుగుతోంది. అయితే పాఠశాల గదులకు చెందిన తలుపులు, కిటికీలు, ఇనుము స్క్రాప్‌ను కొందరు అక్రమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. టన్నుల కొద్ది ఇనుప స్క్రాప్‌తోపాటు తలుపులు, కిటికీలు అమ్ముకుని సొమ్ము చేసుకోవడానికి పథకం వేశారు. వాస్తవంగా ప్రభుత్వ ఆస్తులు ఏవైనా వేలంపాట ద్వారా అమ్మి ప్రభుత్వ ఖజానాకు జమచేయాల్సి ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా లోకల్ బీఆర్ఎస్ నాయకుడు చక్రం తిప్పి రూ.లక్షల విలువైన సామగ్రిని మాయం చేసేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై హెచ్ఎం దూస గోవర్ధన్, ఎంఈవో దూస రఘుపతిని 'సాక్షి' వివరణ కోరగా భవనాల నిర్మాణ పనులు తమ ఆధీనంలో లేవని ఇతర మండలాల మాదిరిగానే ఇక్కడ కూడా జరుగుతోంది అని సమాధానం చెప్పారు.

బైండోవర్ వ్యక్తుల జాబితా సిద్ధం

- ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్



సీఐ చంద్రశేఖర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గుడుంబా రహితసమాజమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త చట్టాలను అమలు చేస్తోందని, గతంలో నేరాలకు పాల్పడి బైండోవర్ అయిన వ్యక్తులు, పాత నేరస్తుల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు నేరాలకు పాల్పడి బైండోవర్ అయిన వారి జాబితాను క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ) చట్టం ప్రకారం ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు వివరించారు. గుడుంబా, గంజాయి కేసులలో సర్కిల్ పరిధిలో 14 మందిని బైండోవర్ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన 12 మంది నుంచి రూ.12 లక్షలు జరిమాన రూపంలో వసూలు చేసి ప్రభుత్వ ఖజానాలో జమచేయడం జరిగిందన్నారు. అలాంటి కరడు గట్టిన నేరస్తులతో పాటు జిల్లావ్యాప్తంగా బైండోవర్ చేసిన వ్యక్తుల ప్రతి కదలికపై ఈ చట్టం ద్వారా నిఘా ఉంచుతామన్నారు. గుడుంబా కట్టడికి ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేస్తుందని, గంజాయి, గుడుంబా అమ్మకాలకు దూరంగా ఉండాలని కోరారు. బెల్లం అమ్మకందారులకు కూడా ఈ చట్టం వర్తిసుందని, వెంటనే అమ్మకాలు నిలిపివేసి తమకు సహకరించాలని కోరారు. కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి బెల్లం దిగుమతి అవుతున్నట్లు సమాచారం ఉందని, రవాణకు వినియోగించే వాహనాలు పట్టుపడితే సీజ్ చేస్తామన్నారు. ఈ చట్టంపై గ్రామాలలో అవగాహన కల్పిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ఎంపీ సంజయ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయి వాలీబాల్ మహిళల విభాగంలో సత్తాచాటారు. ఖేలో ఇండియా– జీతో ఇండియా క్రీడోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల శాసనసభ స్థాయిలో ప్రథమస్థానం సాధించి పార్లమెంట్‌స్థాయిలో ఎంపికయ్యారు. కరీంనగర్ పార్లమెంట్ స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయినట్లు వాలీబాల్ టీం కోచ్, పీఈటీ అనిల్‌గౌడ్ మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో సైతం తమ సత్తా చాటి ప్రథమ స్థానంలో రాణించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను ఎంపీ బండి సంజయ్‌కుమార్ , సర్పంచ్ పాశం సరోజన, ఎస్ఎంసీ చైర్మన్ గోగూరి శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం



విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను పోలీసులు అక్రమం అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ఆధ్వర్యంలో రగుడు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో దర్యాప్తు వేగవంతం చేయాలని అధికారులను కలవడానికి వెళ్తున్న షర్మిలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగుల పక్షాన వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌టీపీ నాయకులు లక్ష్మీనారాయణ, వంగరి అనిల్, కరుణాకర్‌రెడ్డి, జింక ఎల్లయ్య, ఆనంద్, అనిల్, ప్రశాంత్, మహేష్, మధు, తదితరులు ఉన్నారు.